ధాత ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన కథ

డాటర్ (ఇన్-లా)

- ఎమ్. హేమలత



"అమ్మా! ఎవరొచ్చారో ఇలా వచ్చి ఒక మాటు చూడు" సురేష్‌కేకలకి అన్నపూర్ణమ్మ చేస్తున్న పని ఆపి, వాకిట్లోకి వచ్చింది.

గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాడు సురేష్ -ఆ వచ్చిందెవరో అన్నపూర్ణమ్మకి అగుపించకుండా!

"అదేంట్రా! అడ్డులే! వచ్చిందెవరో చెప్పకపోతే మానె! చూడనన్నా చూడనివ్వవా..." కొడుకును లాగినంత పని చేసిన అన్నపూర్ణమ్మకు నవ్వు ముఖంతో కనకలక్ష్మి దర్శనమిచ్చింది.

"కనకా! నువ్వా!! - సురేష్! పిన్ని వచ్చిందని చెప్పక ఏవిట్రా ఈ పరాచికాలు. అయినా, కనకా, నువ్వేంటీ చిన్నపిల్లలా వాడి వెనకాల దాక్కున్నావు?". అక్కాచెల్లెళ్ళు నవ్వుకుంటూ లోపలికి నడిచారు. సురేష్ సూట్‌కేసు, ట్రావెలింట్ బ్యాగు లోపలికి చేరవేసాడు.

"ఆంటీ! బాగున్నారా?" అంటూ, కాఫీ కప్పుతో హాల్లోకి వచ్చిన సంగీత పిన్నత్తను పల్కరించింది.

సంగీత ప్రశ్నకు సమాధానమా అన్నట్లు తలను అటూ-ఇటూ వూపి "అక్కా! బావగారేరి..కన్పించరేం..?" అంటూ అన్నపూర్ణమ్మ కేసి చూసింది కనకలక్ష్మి

"పిల్లల్ని స్కూల్లో దింపడానికి వెళ్ళారు. ఈ పాటికి వచ్చేస్తూంటారు. అదో స్కూటర్ చప్పుడు.."

"రానే వచ్చారు రాఘవ

రావుగారు.

"అరరే! బహుకాల దర్శనం. మా తమ్ముడుగారు పర్మిషన్ గ్రాంట్ చేసినట్లున్నారే! అయినా, ఉత్తరం రాస్తే, సురేష్ స్టేషన్‌కి వచ్చే వాడు కదా! శంకరం కూడా వచ్చి ఉంటే బాగుండేది... అన్నట్లు సురేష్! స్ఫూర్తి కీరోజు స్కూల్లో ఏదో డ్రిల్ ప్రాక్టీస్ ఉందట. సాయంత్రం తీసుకువచ్చేటప్పటికి లేట్ అవ్వొచ్చు. వెజిటబుల్స్ కూడా లేనట్లున్నాయి.."

"అవన్నీ నేను చూసుకుంటాను లేమ్మా.. నువ్వు కాలేజికి నడు.. ఇప్పటికే లేట్ అయింది.." అన్నపూర్ణ తొందరపెట్టింది సంగీతని.

"వస్తానాంటి! ఇక రాత్రికే మన కబుర్లు.." కనకలక్ష్మి కేసి చూస్తూ చకచకా చెప్పులేసుకుని,హాండ్‌బాగ్ భుజానికి తగిలించుకుని, సురేష్ వెనక స్కూటర్ మీద కూచుని 'బై' చెప్పింది సంగీత.

వెళుతున్న సంగీతని విస్తుపోయి చూస్తూ నిల్చున్న చెల్లెలుతో అంటోంది అన్నపూర్ణ, "కనకా! నీ కోసమని సంగీత మళ్ళీ గీజర్ ఆన్ చేసినట్లుంది. స్నానం చేసిరా! నేను, మా ఇద్దరికీ, నీకూ కలిపి బియ్యం కుక్కరులో పడేసి వస్తాను. తీరుబడిగా కబుర్లు చెప్పుకుందాం.."

"అదేంటక్కా! కోడలుపిల్ల నీకు, బావగార్కి అన్నం వండదా..?" ప్రశ్నించింది కనక.

"ఎందుకు వండదూ...! చల్లారిపోతుందని నేనే నిదానంగా పెడ్తాను. అయినా, కుక్కర్లో బియ్యం పడేయడం కూడా ఒక పనేనా...?"

ఇంకేం మాట్లాడలేక కనక తనకి కేటాయించిన గదిలోకి నడిచింది.

* * *

మధ్యాహ్నం భోజనాలయ్యాక రాఘవరావు గారు కాసేపు పడుకుంటానంటూ గదిలోకి వెళ్ళారు. అక్కా- చెల్లెళ్ళిద్దరూ, పిల్లల గదిలోని పక్కల మీదికి చేరారు.

"త్రీ బెడ్‌రూం ఫ్లాట్ అనుకుంటా అక్కా! బాగానే ఉందే.." అంది మంచం మీద బాసింపట్టు వేసుక్కూర్చుంటూ.

"ఔనే కనకా! మీ బావగారి పెన్షన్ డబ్బులు, సురేష్ బ్యాంక్ లోన్, ఇంకా తక్కువయితే ఊళ్ళోని పొలం కొంత అమ్మితే ఈ ఇల్లు - అదే - ఫ్లాటు వచ్చిం దనుకో.." అన్నపూర్ణ కూడా కనక ప్రక్కనే కూర్చుంది.

"కనకా! వివేక్ అబ్రాడ్ వెళ్ళే ఉద్దేశంలో ఉన్నట్టు రాశావు. ఎంతవరకొచ్చాయేంటి ప్లాన్లు?"

"ఆఁ వాడికి వెళ్ళాలనున్నా, ఛాన్సెస్ రావద్దూ. వచ్చినా మేం వెళ్ళనివ్వద్దూ. కానైతే మా కోడలుపిల్ల మాత్రం మా దుగ్గ పడిపోతోంది. ఎప్పుడెప్పుడు విమానాల్లో ఊరేగుదామా అని.." ఈసడింపుగా అంటున్న కనక కేసి విస్మయంగా చూసింది అన్నపూర్ణ.

"చిన్నవాళ్ళు కదా! అవకాశాలు వస్తే మాత్రం వదలకూడదు కనకా! ఈ వయసులోనే వెళ్ళి రావాలి. మా సురేష్‌కి కూడా అదే చెప్తుంటాను. అది సరే సుమ డాన్సింగ్ ఎంతవరకు వచ్చింది..?" మాట మార్చింది అన్నపూర్ణ. అక్కయ్య తనతో మాట్లాడుతూనే ఉంది- నిద్రలోకి జారుకుంది కనక.

బూట్ల చప్పుడికి మెలకువ వచ్చింది కనకకి. గదిలోకి దూసుకువచ్చిన పదేళ్ళ అజయ్, "నానమ్మా!" అంటూ లోనికి వచ్చి తన పడక మీద ఉన్నది తన నానమ్మ కాదని గ్రహించి రివ్వున వెనుదిరిగి వంటగది ప్రవేశం చేసాడు.

"ఒరే వెధవా! బూటుకాలితో వంటగదిలోనికి రావద్దన్నానా.." గోముగా మనవణ్ణి కసరి బూట్లు విప్పసాగింది అన్నపూర్ణ.

"ఏంటక్కయ్యా! నీ మనవడు నన్ను గుర్తు పట్టినట్లు లేడు...!" డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీని లాక్కుని కూ



ర్చుంటూ అంది కనక.

"ఔను మరి.. అయిదేళ్ళకో.. ఆరేళ్ళకో ఒక మాటు వస్తూంటే ఇలాగే ఏడుస్తాయి సంబంధాలు. అజూ! కాళ్ళూ చేతులు కడుక్కొని రా! టిఫిన్ తిందువుగాని.." ప్లేట్‌లో అటుకుల ఉప్మా సున్నుండలు పెట్టి గ్లాసులో బోర్నవిటా రెడీ చేసింది అన్నపూర్ణ. అలాగే కనకకి ఒక ప్లేటు, తనకో ప్లేటు తెచ్చుకుంది.

"అబ్బ! మధ్యాహ్నం తిన్న అన్నమే అరగలేదు.." అంటూనే, సున్నుండని సున్నితంగా కొరకసాగింది కనక.

"అజూ! టిఫిన్ అయ్యాక కాసేపు ఆడుకో! మీ తాతగారు వాకింగ్‌కి వెళ్ళి తిరిగి వచ్చాక, నీ చేత హోం వర్క్ చేయిస్తారు."

"అలాగే నానమ్మా!" అంటూ టిఫిన్ తినసాగాడు అజయ్.

రేపటికి కావలసిన ఆకుకూర, చిక్కుడుకాయలు డైనింగ్ టేబిల్ మీద పెట్టి, భర్త తెచ్చిన మిగతా కూరగాయల్ని ఫ్రిజ్‌లో సర్దేసింది అన్నపూర్ణ. కనక నానుకుని కుర్చీలో కూర్చుంటూ, "కనకా! కలకత్తా అన్నయ్య దగ్గర నుంచి లెటర్ వచ్చింది, వాళ్ళ గోల్డెన్ వెడ్డింగ్ ఆనివర్సరీ అట వచ్చే నెల. నువ్వు వస్తున్నావా..?"

"ఆఁ నాకూ రాసారు- పోదూ. కలకత్తా అంటే దగ్గరా దారా! బోలెడంత ఖర్చు. గ్రీటింగ్ కార్డు పంపిద్దామని అనుకుంటున్నాను. నువ్వు వెళ్తున్నావా ఏంటి? అయినా, నీకెలా కుదురుతుందిలే! ఇంటి చాకిరీయే సరిపోతుంది పాపం!" కాస్త వెటకారంగా అంటున్న కనకని ఆశ్చర్యంగా చూసింది అన్నపూర్ణ.

"నేనూ, మీ బావగారూ కూడా వెళుతున్నాము. అంతేకాదు, సురేష్, సంగీతలని కూడా రమ్మంటున్నాము. పిల్లలకు ఎలాగూ సెలవులే! డబ్బు ఖర్చు అంటూ చిన్న చిన్న సరదాలని చంపుకుంటే ఎట్లా..?" వలిచిన ఆకుకూరని కట్ చేసి, విరిచిన చిక్కుళ్ళని కవర్లోకి సర్దింది అన్నపూర్ణ.

"అక్కా! నాకు తెలీకడుగుతాను. ఈ పనులన్నీ సంగీత చెయ్యదా? లేక ఆ పిల్ల మెప్పు కోసం నువ్వే ఇవన్నీ చేసి పెడుతున్నావా..?"

"కోడలి మెప్పా.." అంటూ నవ్వింది అన్నపూర్ణ కనకకేమీ సమాధానమివ్వకుండా లోపలికి వెళ్ళింది.

కనకలక్ష్మిది మొదటినుంచీ వింతయిన స్వభావం. అందరూ బాగుందనే చీరనో.. వంటనో వంకలు పెట్టడం ఆమెకు అలవాటు. ఎదుటి వ్యక్తిలోని మంచితనాన్ని చేతకానితనం క్రింద కొట్టిపారేయడం ఆవిడ ప్రవృత్తి. చెల్లెలి స్వభావం చిన్ననాటి నుంచీ తెలిసిన అన్నపూర్ణ, కనకతో వాదనకి దిగక తన పనిలో తాను నిమగ్నురాలైంది.

కనక ఉన్న నాల్గు రోజులు అన్నపూర్ణకి చేతినిండా పని. రోజుకొక్కచోటికి ప్రోగ్రాం పెట్టేది. కాదు కూడదంటే ఎక్కడ నొచ్చుకుంటుందో అని తన దినసరి కార్యక్రమాన్ని కనకకి అనుగుణంగా మార్చుకుని, ఆవిడతోటి తిరుగుతుండేది. పోనీ సంగీత చేత సెలవు పెట్టిద్దామంటే ఎగ్జామ్స్ దగ్గర పడడంతో స్పెషల్ క్లాసెస్ మూలంగా వీలవలేదు. సంగీత ఉమన్స్ కాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్. ఆంధ్రాబ్యాంకులో ఆఫీసర్‌గా ఉన్న సురేష్, బ్యాంకు ఇన్‌స్పెక్షన్ మూలంగా బిజీ అయిపోయాడు. రాఘవరావుగారే ఇంటిపట్టున ఉండి అక్కా చెల్లెళ్ళని బయటికి పంపేవాడు.

* * *

ఏడు గంటలకి నిద్ర లేచిన కనకకి ఇంట్లో ఏదో హడావిడి కనిపించింది. రోజూ ఆ పాటికి వంటింట్లో చురుకుగా పనిచేస్తూ కనిపించే అక్కయ్య అక్కడ లేక

పోవడంతో వెనుదిరిగిన కనకకి సంగీత ఎదురు పడింది.

"అక్క ఎక్కడికెళ్ళింది సంగీతా?"

"అత్తయ్యకి ప్రొద్దుటినుంచి జ్వరం ఆంటీ. డాక్టరుకి ఫోన్ చేసాను. టెంపరేచర్ తగ్గడానికి మాత్ర చెప్పి ఇమ్మన్నారు! అయినా జ్వరంతో కూడా లేచి కుక్కర్ పెట్టారు చూడండి! నన్ను లేపొచ్చు కదా" బాధగా అంటూ వంటింట్లోకి వెళ్ళింది సంగీత.

గబగబా అక్కయ్య దగ్గరికి వెళ్ళింది కనక. కుర్చీలో చేరగిలబడి కూర్చుంది అన్నపూర్ణ. "అక్కా! నీది మరీ విపరీతం. జ్వరంలో కూడా నువ్వే వండి వార్చాలా..?" కోపంగా అంటూన్న కనకను చూస్తే అన్నపూర్ణకి నవ్వొచ్చింది.

"జ్వరం వచ్చిందా అక్కా- ఎలావుంది..?" అన్న మాట లేదు కానీ, 'ఎవరికో ఎందుకు చేస్తున్నావు?' అన్న ఫిర్యాదు.

"కనకా! జ్వరం ఈ రోజుల్లో సర్వసామాన్యం. అయినా, సంగీత ఏదో చిన్న పిల్ల, హడావిడి పడ్తూంటే, నువ్వు కూడా ఏంటలా హైరానా పడ్తున్నావు. జ్వరం మరీ ఎక్కువగా ఉండి లేవలేని పరిస్థితి ఏర్పడితే చూద్దాంలే,," సంగీత తెచ్చి ఇచ్చిన మాత్ర వేసుకుని వేడిపాలు త్రాగింది అన్నపూర్ణ.

"సంగీతా! కుక్కర్‌లో పప్పు, చిక్కుళ్ళు, బియ్యం పెట్టాను. నిన్నటి పుదీనా పచ్చడి ఫ్రిజ్‌లో ఉంది. చారు పెట్టు. చిక్కుడు తాలింపు వెయ్యి. ఈ రోజు టిఫిన్ కాంటీన్‌లో తినేయండి. పిల్లలకి బ్రెడ్ టోస్ట్ చేసిచ్చేయి. కనకా! నువ్వు బ్రేక్‌ఫాస్ట్ లంచ్ కలిపి ఏకంగా బ్రంచ్ చేసేయి"

"అత్తయ్యా! మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి! మా తంటాలు మేము పడ్తాము. మీరు రండి ఆంటీ!" అంటూ కనకని బయటకు పిల్చింది సంగీత.

అన్నపూర్ణ ఫ్లూజ్వరంతో పడక వేసిన ఆ నాలుగు రోజులు ఆ ఇంటిల్లిపాది పడిన ఆరాటం, అదుర్దా.. నిజం చెప్పాలంటే కనకకి కంటగింపు కలిగించింది. సురేష్- సరే కొడుకు. రక్తం పంచుకుపుట్టినవాడు. 'అమ్మా! అమ్మా!' అంటూ ఆవిడ చుట్టూ పదిసార్లు తిరిగి పరామర్శించాడంటే అర్థముంది. అది తల్లీకొడుకుల సంయమనం. ఇదేంటి ఈ కోడలుపిల్ల- అందునా పరాయిది- అంతలా ఆవిడని అంటిపెట్టుకుని ఉపచారాలు చేసింది. అక్కయ్య కోడలికి పనులు చేసి పెట్టడం మెప్పు కోసం అనుకుంటే మరీవిడ అత్తగారి మీద చూపించే ప్రేమానురాగాలని గురించి ఏమనుకోవాలో ఒక్క పట్టాన బోధపడలేదు కనకకి.

అన్నపూర్ణ లేచి కాస్త తిరుగాడడం మొదలుపెట్టగానే తిరుగు ప్రయాణానికి సిద్ధమయింది కనక.

"అదేంటే కనకా! రాక రాక వచ్చావు. ఇంకో నాలుగురోజులుండరాదూ! నాకూ కాస్త ఓపిక వచ్చిందిగా. చూడవలసిన మిగతా ప్రదేశాలు సరదాగా తిరిగి చూడొచ్చుగా.."

"ఒద్దులే అక్కా! ఇప్పటికి చూసిందే చాలు.. నేనొచ్చి నీకు అనారోగ్యం తెచ్చిపెట్టాను.."

"ఛా.. అవేం మాటలే! నిన్నలా ఎవరైనా అన్నారా? ఎందుకట్లా అంటావు? ఇంకా నయం సంగీత, సురేష్ వినలేదు. లేకుంటే ఎంత నొచ్చుకునేవారో? మనిషన్నాక రోగం రాకుండా ఉంటుందా..?"

అక్క మాటలని తోసిరాజని ప్రయాణం కట్టింది కనక.

* * *

కాలేజి నుండి వస్తూ సంగీత, కనకకి వెంకటగిరి జరీ చీర, మాచింగ్ బ్లౌజ్ తెచ్చి అన్నపూర్ణ చేతికిచ్చింది, "అంటీకి ఈ కలర్ నచ్చిందేమో కనుక్కోండి అత్తయ్యా! లేకుంటే మార్పిస్తాను.." అంటూ.

చక్కటి ఆకాశం రంగు చీరది. సన్నటి జరీ తీగలు.

హంసల బార్డరు. 'బాగుంది' అంటూ, కనక కూడా ఓకే చేసింది. కాకుంటే, "అయినా, ఈ చీరసారెలు నాకిప్పుడెందుకమ్మా!" అంది సంగీత వేపు చూస్తూ.

ఆ సాయంత్రం రైలుకే కనక ప్రయాణం. మధ్యాహ్నం భోజనాలయ్యాక అక్కాచెల్లెల్లిద్దరూ కబుర్లలో పడ్డారు.

"అక్కా! ఈ సారి నువ్వే రావాలి మా ఇంటికి. ఈ చాకిరీలు, బాదరబందీలు ఎప్పుడే ఉండేవే! ఆడవాళ్ళం, మనం పుట్టగానే మనతోటే పుట్టిన ఈ చాకిరీలు మనం చచ్చాక కానీ మనల్ని వదలవు. మా కోడలు పిల్ల కూడా చాకచక్యంగా ఇంటిపని, వంటపని నా మీదికి నెట్టాలని చూస్తుంది. నేను నీలాగా పొగడ్తలకి బోల్తా పడే అమాయకురాలిని, అల్పసంతోషిని కాను.

"అయినా, నేను వచ్చినప్పటినుండి చూస్తున్నాను. 'వంటపుట్టి' లాగా వంటింటికి, ఆయాలాగా పిల్లలకి అంకితమయ్యావు. ఇక బావగారంటావా, ప్యూన్ లాగా పిల్లల స్కూళ్ళకి, బజారు పనులకి, ఇంకాస్త టైముంటే ట్యూషన్ టీచర్‌లాగా పిల్లల చదువులకి సరిపోయారు. పెద్దవారయ్యారు. కాస్త విశ్రాంతి, మీకంటూ ఒక వ్యాపకం ఏర్పరచుకోవాలి కదా! నేనూ- మీ మరిది చూడు. మాకొచ్చే పెన్షన్ డబ్బులతోనే చక్కగా టూర్లకి వెళ్తాం. ఇక ఇంట్లో వున్నా- ఇటువంటి బాదరబందీల జోలికి పోము."

"కనకా! ఎంత తప్పుగా ఆలోచిస్తున్నావు నువ్వు! నేను ఈ ఇంట్లో ఓ పనిమనిషినా? నీకలా అన్పించిందా? అయినా, కనకా నువ్వొచ్చినప్పటి నుంచి గమనిస్తున్నాను, సంగీతని కోడలుపిల్ల, పరాయిపిల్ల అంటూ భేదభావంతో చూస్తున్నావు. తన పుట్టింటిని, కన్నవారిని వదిలి మనతో కల్సి జీవితాన్ని పంచుకోవడానికి వచ్చిన పిల్ల పరాయిదెట్లాఅవుతుంది? అదే, సంగీత నా కూతురయితే, నేనిలా చేస్తుంటే నువ్వు తప్పు పట్టగలవా?"

"ఆఁ ఎన్ని చెప్పినా- కోడలు కూతురవుతుందా?" అంది కనక.

"అక్కడే పొరబడుతున్నావు కనకా నువ్వు. కోడల్ని ఇంగ్లీషులో డాటర్ ఇన్‌లా అంటారు. నీకు తెలుసు కదా! హక్కుతో మనింటికి వచ్చే కూతురన్న మాట. తనింటి పేరు మార్చుకుని మనింట ప్రవేశించే ఆ అమ్మాయిని కూతురిలాగే ఆహ్వానించాలి. నాకు సంగీతని చూస్తే స్వంత కూతురిలాగే ఉంటుంది. అంతేగాదు, ఒక్కొక్క మాటు స్నేహితురాలిలాగా కూడా ఉంటుంది.

"అయినా, కనకా! ఇది నా ఇల్లు. నా కొడుకు, కోడలు, మనవలు, అందరూ నా వాళ్ళు. వాళ్ళకి చేయడం నాకు శ్రమ కాదమ్మా! అది నా ఆనందం. మీ బావ గారంటావా - ఆయనకిష్టం లేని పని ఆయన చేత చేయించడం బ్రహ్మతరం కూడా కాదు. మేమిద్దరం ఈ ఇంటి మూలస్థంభాల లాంటి వాళ్ళం. ఈ స్థంభాలకు అల్లుకున్న పొదరిల్లే మా ఈ పర్ణశాల. స్థంభాలు ధృడం గా, గట్టిగా ఉంటేనే అల్లుకు పోయే ఇల్లు ఆరోగ్యంగా, ఆనందంగా, వృద్ధి, అభివృద్ధి చెందుతుంది. ఈ సత్యాన్నే నువ్వే కాదు, ప్రతి ఒక్కరూ తెలుసుకుని తమ తమ పరిధిల్లో ఉండి చిన్నవాళ్ళ లోటుపాట్లని సవరిస్తూ, తమ నడవడికను పెద్దవారు కూడా కాలానుగుణంగా మలుచుకుంటూ, గృహ సామ్రాజ్యాన్ని సుఖ సంతోషా లతో నింపుకోవాలి. నేనేదో ఉపన్యాసం దంచానని విసుక్కోకుండా, నా మాటల్లోని ఔచిత్యాన్నిగురించి ఆలోచించు. చూసావా! మాటల్లో పడి టైమే మరిచి పోయాను. నీకు ప్రయాణానికి పులిహోర కలపాలి. పిల్లలకు కూడా అదే టిఫిన్. వాళ్ళొచ్చే వేళ కూడా అయింది." లోపలికి వెళుతున్న అన్నపూర్ణ కేసి, విస్తుపోయి చూస్తూ కూచుంది, సగటు 'అత్తగారు' కనకలక్ష్మి. ❑